


# -44-
## సాహితీ సదస్సులూ- చమత్కారాలూ

**గత కొన్ని నెలలుగా** మా ఇంట్లేనే కాదు, అటు ఆస్ట్రేలియాలో మెల్బర్న్ నుంచి మొదలు పెట్టి సింగపూర్, హైదరాబాద్, లండన్, జొహానెస్ బర్గ్ ల మీదుగా ఇటు అమెరికా దాకా ఏడుగురు ఇళ్ళలో కూడా ఒకటే హడావుడి. ఎందుకంటే ఈ ఏడుగురు సంసారులకీ అసలు ఉద్యోగాలూ ఏమైనా ఏడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకి ప్రధాన నిర్వాహకులు. గిట్టని వాళ్ళు మమ్మల్ని 'నిరవాక సభ్యులు" అని కూడా అంటారు. కానీ ఎవరో ఒకరు నిర్వాకం చేసి ఉద్ధరిస్తే కాని సాహిత్యానికి కూడా హితం జరగదు కదా! అంచేత మేమే ఆ ఉద్ధారకులం....అనేసుకుని రంగం లోకి దిగిపోయాం. అంటే మా 'శేరీ ఇస్తువా పంపు" అనబడే మా పొలానికి మా చిన్నప్పుడు ఉండే "తాచు" గాడి లాంటి వాళ్ళం అనమాట. సన్నగా, రివటలా ఉన్నా, గొంతు విప్పి పాడితే ఆమడ దూరం వినపడే ఆ తాచు గాడు, మా మైసూరు ఎడ్ల బండి ఎక్కి "హై" అని వాటిని వంద మైళ్ళ వేగంగా నడిపించ గలిగే ఆ 'తాసు' గాడు మా ఉద్ధారకుడు...అంటే మా పాలికాపులు అందరికీ నాయకుడు అని అర్ధం... ఈ సాహితీ సదస్సు ఏడుగురూ అలాంటి 'తాచు" గాళ్ళే. ఎవరూ పెద్ద తాచూ, చిన్న తాచూ అంటూ కాకుండా "నాయకత్వ పోరాటం" లేకుండా అందరం "సమాన తాచు"లం. కానీ నేను కాస్త ఎక్కువ సమానం...ట...ఏదో నాలుగేళ్ళు మీద పడ్డాయి కదా..అందుకూ ఆ వైభోగం...

నిజానికి ఇది వరకటి ప్రపంచ ఆరు సదస్సులూ నాలుగు ఖండాలలో అయ్యాయి కాబట్టి ఈ సారి దక్షిణ ఆఫ్రికా లో జొహానెస్ బర్గ్ లో పెడదాం అని నేను పెట్టే , బేడా సద్దుకుని హ్యూస్టన్ లో విమానం ఎక్కబోతూ ఉంటే ఈ దిక్కుమాలిన కరోనా వచ్చి చచ్చింది. అంచేత ఈ 7వ సదస్సు జూమ్ వీడియో లోనే నిర్వహించాలి అని 'సాహిత్య ఉద్ధారక కమిటీ" వాళ్ళం అనేసుకున్నాం. ఈ రోజుల్లో మొగుడూ, పెళ్ళాలే "ఇలా రా" అనే బదులు "జూమ్ లోకి రా" అని పిల్చుకోవడం మొదలుపెట్టారు కదా!. ఇక జూమ్ లో జరిగే వాటిని "సమావేషం" అంటాను నేను. ఎందుకంటే అంతా బుల్లి బుల్లి తెర మీదే కదా!. అంటే ఇక రంగ స్థలం, విందు భోజనాలు, ఆహ్వానిత అతిధుల టిక్కెట్లు, వారితో ఇక్కట్లు, హొటెల్ ఖర్చులు వగైరాలు ఉండవు. అరవ చాకిరీ తగ్గిపోయి, "గాలి కలయిక" కి కావలసిన 'సాంకేతిక చాకిరీ" మాత్రం కావాలి. ఇక

సింగపూరూ, మెల్బర్న్ వారి ధర్మమా అని ఆ ఏర్పాట్లు చక, చకా అయిపోయాక, మళ్ళీ యథాప్రకారం ఈ "సదస్సు జరుగుతొందోచ్, వక్తలకి ఆహ్వానం ఓచ్" అనే మొదటి ప్రకటన "అంతా ఉచితం ఓచ్" అని పెద్ద పెద్ద అక్షరాలతోనూ నేనే తయారు చేశాను. అంటే ఎక్కడో అక్కడ "మొట్ట మొదటి", 'అద్వితీయ', "చరిత్ర సృష్టించిన" మొదలైన పడికట్టు పదాలు వాడేసి, పది రోజులు తంటాలు పడి, అది మా డిజైనర్ కి పంపించాను. ఆ కంప్యూటర్ కుర్రాయన నేను వ్రాసిన దానికి సొంత పైత్యం కాస్త తగిలించి...అంటే ఈ నాటి తెలుగులో దాన్ని "ఉద్ధరించి", రంగులూ, పింగులూ తగిలించి సొగసైన మొదటి ప్రకటన తయారు చేసి నాకు పంపించాడు. ఇలాంటి వాటిల్లో మన తప్పులు మనకి కనపడవుగా. అంచేత అందులో ఏమైనా అచ్చుతప్పులూ, అసలు తప్పులూ ఉన్నాయేమో అని మా 'సాహిత్య ఉద్ధారక కమిటీ" వారికి పంపించాను. గత నా పాతికేళ్ళ అనుభవం లాగానే ఈ సారి కూడా...అందరూ ముందు చేసేది వాళ్ళ ఫొటో పడిందా లేదా? పడెనుబో..పేరు సరిగ్గా పడెనుబో, ఎన్ని సార్లు పడెను. అదే విధముగా నా ఫోన్ నెంబర్, ఇమెయిల్ వగైరాలు పడెనా లేదా? వగైరాలు అయ్యాక తప్పులు సరిదిద్దాక ఆ ప్రకటన ప్రపంచం మీదకి వదిలేశాను.

ఇక్కడ నా సొంత గోడు చెప్పుకోవాలి మరి. అనగా....నా పేరు ఖూనీ అయినన్ని సార్లు ఇంక ఏ తెలుగువాడి పేరూ అయి ఉండదు అని నా ప్రగాఢ నమ్మకం. ఏదో నా పేరు కూడా పీకే రాజో, ఏకే రాజో, రాజ్ బాబో అయ్యుంటే కొంచెమే ఖూనీ అయి ఉండేది కానీ...మన పేరు అలా కాదే. అంచేత దీనీ విచ్చలవిడిగ ఎవడికి తోచినట్టు వాడు ఒక ఆట ఆడేసుకున్నాడు. ఇక నేను పట్టించుకోవడం మానేశాను. ఆ మాటకొస్తే ఎవరైనా "అర్థం పర్థం లేని" రాజు అని రాస్తే అది నా పేరే అనుకుని, అప్పుడు ఆ పేరు పైన ఉన్న నా ఫొటో చూసి నిర్ధారణకి వస్తాను. నా ఫొటో మటుకు ఎప్పుడో ఇక్ష్వాకుల నాడు సూటూ, బూటూ వేసుకున్న ఫొటో యే వేస్తారు. అంతకీ ఈ మధ్యనే తీయించుకున్న ఫొటో పంపించినా, అది అందనట్టు ఓవర్ ఏక్షన్ చేస్తారు. అదెందుకో  నాకు తెలియని రహస్యం కాదు. నేను కూడా ఎప్పుడైనా ఎవరైనా సినిమా తార ఫొటో వెయ్యాల్సి వస్తే ఆవిడ చిన్నప్పుడెప్పుడో ఏఎన్నార్ తో సినిమా హీరోయిన్ ఫొటో యే వేస్తాను కానీ, ఇప్పటిది వెయ్యను కదా!.

ఇక అన్ని సవరణలూ అయ్యాక, అద్భుతంగా తీర్చిదిద్దిన ప్రకటన విడుదల చేసి ప్రపంచం లో నాకు తెలిసిన, తెలియని తెలుగు వాళ్ళందరికీ పంపించగానే, ఇక "దాడి" మొదలు. ఈ సారి కూడా నాకు మరొక సారి ఖచ్చితంగా అర్థం అయిన విషయం ఏమిటంటే.."మనం ఎంత జాగ్రత్తగా, నలుగురు చేత సమీక్ష కూడా చేయించి కావలసిన సమాచారం అంతా ప్రకటన లో ఇచ్చి చచ్చినా, అది అందుకుని, చూసిన అర దజను మందిలో దజను మందికి వారి వారి బుర్రలో ఉన్న రంపం పొట్టు ఉందేమో తెలియదు కానీ, అందులో అతి కొంత సమాచారం మాత్రమే కనపడుతుంది. ఆ కనపడిన దాంట్లో కొంత మాత్రమే అర్థం అవుతుంది. మరి కొంత అపార్థం అవుతుంది. అనగా....మనం నాలుగు పేజీలలో కావలసిన సమాచారం అంతా ఇచ్చేశాం కదా అనుకుంటే, మనకి వచ్చే స్పందనలు గొప్ప తమాషా గా ఉంటాయి..

వీళ్ళెవరూ నాకు తెలిసిన వారు కాదు. ఆ కేటగిరీ వేరు. వాళ్ళ స్పందనలలో తమాషాలు వేరు. నాకు తెలియని వారి దగ్గర నుంచి వచ్చిన కొన్ని ఉదాహరణలు ఈ క్రింద ఇచ్చాను..సరదాకి.

"మీ ప్రకటన అందింది. నేను వక్తగా పాల్గొనుటకు ఎవరిని సంప్రదించాలో తెలుప గలరు" –

(ఇలాంటివి నా ప్రకటన చూడ్డానికి అమాయకంగా ఉన్నా, దాని అర్థం ఏమిటంటే నేను పంపించిన మైల్ ఇంకా 'దారిలో ఉండగానే"..అంటే నేను పంపించిన ఐదారు నిముషాలలో ఈ ప్రశ్న వచ్చేస్తుంది. అంటే ఈ మానవుడు మొదటి పేజీ మాత్రమే చూసి నాకు రిప్లై కొట్టేశాడన మాట.  పూర్తిగా చదివితే కదా ఎవరిని సంప్రదించాలో తెలిసేది?)

"నేను బస్సులో అమలాపురం వెళ్తున్నాను. అక్కడ మా అమ్మాయి ఉంది. వెళ్ళగానే డిటైల్డ్ గా మైల్ పంపిస్తాను."

(-----అసలు ఈయన అమలాపురం వెళ్తే నాకేమిటీ? బస్సులోనో, ఎద్దు బండిలోనో వెళ్తే నాకేమిటీ? అక్కడ వాళ్ళ అమ్మాయో, అబ్బాయో, మధుర వాణో ఉంటే నాకేమిటీ?)

"నాకు వాట్సాప్ లో తెలుగు రాయడం రాదు. నేర్పించగలరా? – రావు

(హోరి నాయనోయ్! అసలు ఎవడీ రావు? ఆయనకి ఏమి వచ్చును? ఏమి రావు? నేను క్లాస్ పీకుట ఎటుల?)

"నేను నన్నయ నుంచి నారాయణ రెడ్డి దాకా మాట్లాడగలను.. ఏ అంశం మీద మాట్లాడమంటారు? నాకు పర్వానికి ఒకటి చొప్పున 18 బిరుదులు కలవు."

(దీని అర్థం ఏమిటంటే..ఈయనకి ఏదో ఒకటి మాట్లాడితే చాలు. అది కూడా మనమే చెప్పాలన మాట)

'నా సాహిత్య ప్రస్థానం గురించి మాట్లాడతాను. నా వయసు 70 ఏళ్ళు. సుమారు గంటన్నర కావాలి కానీ మీకు అంత సమయం ఉండదు కాబట్టి గంటకి కుదించే ప్రయత్నం చేస్తాను"

(ఈయన గురించి వేరే చెప్పేదేముంది. సమయం ఇస్తే ఆయనే రోజుల తరబడి చెప్పుకుంటాడు.)

ఈ సారి అన్నింటికీ పరాకాష్ట గా ఒక విషయం లో నాకూ, "మా సాహిత్య ఉద్ధారక కమిటీ" లో కొందరికీ వచ్చిన ప్రశ్నలు మాకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించాయి. అదేమిటంటే మా ప్రకటన లో 'వక్తలకి ఆహ్వానం: అనే మకుటం లో మిగతా విషయాల తర్వాత ఆఖర్న "యువతరం వక్తలకి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. 18–35 లోపు వక్తలు ప్రసంగ వ్యాసం తో పాటు వయస్సు ధృవీకరణ పత్రం కూడా పంపించండి" అని వ్రాశాం.

ఇహ చూసుకోండి.

"నా వయసు 68. నేను పాల్గొనవచ్చునా?

"ఇది అన్యాయం. యువతరం కానంత మాత్రాన మా లాంటి పెద్దవారిని పక్కకు పెట్టడం సరి అయిన పద్ధతి కాదు. నా వయసు 55. అవకాశం ఇప్పించండి"

'నేనూ, 22 ఏళ్ళ మా అబ్బాయీ..ఇద్దరం కలిసి పాల్గొనవచ్చు కదా!"

ఇలా మాకు ఉత్తరాలు వస్తే ఏమనుకోవాలి? యువతరాన్ని ప్రోత్సహించడానికి 'ప్రాధాన్యత ఇస్తాం" అన్నాం కానీ కేవలం యువతరం మాత్రమే పాల్గొనాలి" అని ఈ బడుద్ధాయులకి ఎలా అర్థం అయిందో మరి?

మొత్తానికి ఈ 7వ సాహితీ సదస్సు వలన నేను వాట్సాప్ లో ఒక "కక్ష" తీర్చుకోగలిగాను...ఎందుకంటే...నన్ను అడక్కుండా, నా ప్రమేయం లేకుండా నన్ను వాళ్ళ "గుంపు" లోకి చేర్చేసుకుని, రోజుకి అర డజను పైగా మెసేజ్ లు "వారి కుక్క కి చేసిన జబ్బు", "మా మూడో కోడలి రెండో కూతురు సీమంతం" మధ్యే, మధ్యే శ్రీశ్రీ సిప్రాలి పద్యాల దాకా పంపిస్తున్న ఈ గుంపు వాళ్ళందరికీ నేనే ఈ 7వ సదస్సు వివరాలు పంపించేసి "కసి' తీర్చుకున్నాను. "ఆ గుంపుల్లోంచి తప్పుకోవచ్చు కదా. ఎందుకు అలా వాళ్ళని ఆడిపోసుకుంటావు, హన్నా" అని మా క్వీన్ విక్టోరియా నన్నే కోప్పడినా.....ఏమో అప్పుడప్పుడు మంచి సాహిత్య విశేషాలు వస్తూనే ఉంటాయి కదా అని ఆ పని చెయ్యడం లేదు. అయితే అదేదో "తెలుగు సంస్కృతి" లాంటి పేరున ఒక గుంపు నాయకుడి కి నా మీద కోపం వచ్చి "మా గుంపు కి శని, ఆదివారాలు మాత్రమే ఫొటోలు ఉన్న పోస్ట్ లు చెయ్యాలి అనే రూలు నిన్న పెట్టాం. ఇవాళ సోమవారం అని తెలియదా? ఆ మాత్రం బుద్ధి లేదా? నువ్వు ఎంత గొప్పవాడివైనా, రూల్సు పాటించక్కర లేదా? కాబట్టి నిన్ను మా గుంపు నుంచి తక్షణమే తొలగిస్తున్నాం" అని శుభ వార్త చెప్పాడు కానీ ఇప్పుడు నాకు "తెలుగు సంస్కృతి" తెలియాలంటే ఎలాగో తెలియడం లేదు!

సీరియస్ లీ..( దీన్ని తెలుగు లో ఎలా వ్రాయాలో నాకు తెలియదు.)

అక్టోబర్ 10-11, 2020 తేదీలలో జరిగిన 7వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సూ, దానికి పరాకాష్ట గా అక్టోబర్ 31, 2020 నాడు జరిగిన విజయోత్సవాలలోనూ సుమారు 230 మంది సాహితీవేత్తలు ప్రసంగించగా, ప్రపంచ వ్యాప్తంగా 25 వేల మందికి పైగా వీక్షించడం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మైలు రాయి.

తురుష్కుల దండయాత్రలలో మత ద్వేషం, ఆంగ్లేయుల పరిపాలనలో మెకాలే సిద్ధాంత వైపరీత్యాలూ, స్వదేశీయుల పరస్పర విభేదాల మధ్య తెలుగు భాషా సాహిత్యాలు ఎన్ని సార్లు విషవలయం లో చిక్కుకున్నా, ఏ నన్నయ భట్టారకుడో, సి.పి. బ్రౌన్ మహాశయుడో, గురజాడ/గిడుగు ద్వయమో, శ్రీశ్రీ యో అవతరించి భాషని పునరుజ్జీవితం చేసినట్టే, మళ్ళీ ఈ నాటి సినీ, రాజకీయ, విద్యావ్యాపార కలుషిత విష వలయం నుంచి తెలుగు భాష తన సంకెళ్ళు తనే విప్పుకుని మళ్ళీ పునర్వైభవం పొందే దాకా తెలుగు భాషాశాస్త్రవేత్తలూ, భాషోద్యమకారులూ, మరీ ముఖ్యంగా సాహితీవేత్తలు తెలుగు భాషా పరిజ్ఞానాన్నీ, సాహిత్య జ్ఞాన సంపదనీ పొదివి పట్టుకుని ఒక ఒక కొమ్ము కాస్తూనే ఉంటారనే నమ్మకాన్ని ఈ 7వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు నిస్సందేహంగా కలిగించింది.

**COMMENTS**